పేకాటరాయుళ్ల అరెస్ట్

జగద్గిరిగుట్ట, ఆగస్టు 28 : పేకాట శిబిరంపై దాడిలో నిందితులను పట్టుబడ్డారు. జగద్గిరిగుట్ట పోలీసుల వివరాలమేరకు..గాజులరామారం డివిజన్ మట్లారెడ్డినగర్‌లో కొంతకాలంగా ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం శిబిరంపై దాడి చేశారు. ఘటనలో ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.67 వేలు, 10 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ అపార్ట్‌మెంట్‌లో
అగ్నిప్రమాదం

మూసాపేట, ఆగస్టు 28: కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఓ ఆఫీస్‌లోని రికార్డులు, కంప్యూటర్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మూసాపేట గూడ్స్‌షేడ్ రోడ్డులోని దాసయ్య ప్లాజాలో కూకట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉంది. ఆఫీస్ ఆవరణలో డాక్యుమెంట్ రైటర్స్‌కు సంబంధించిన షట్టర్లు ఉన్నాయి. అందులోని ఓ షట్టర్‌లో వినయ్ కుమార్ గౌడ్‌కు చెందిన 'మీసేవ' కేంద్రం ఉంది. మీసేవ నుంచి ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు ఎగిసి పడుతుండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే వారు సనత్‌నగర్ అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో వారు సకాలంలో వచ్చి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఆఫీస్‌లోని కంప్యూటర్లు, రికార్డులు, ఇతర సామగ్రి బూడిదైంది. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందని భావిస్తున్నారు.

పార్కు స్థలంలో వెలసిన ప్రహరీ కూల్చివేత

పార్కు స్థలంలో నిర్మించిన ప్రహరీని కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

- సింహపురికాలనీలో పార్కు స్థలాల విక్రయాలు బట్టబయలు
- ప్రహరీని నేలమట్టం చేసిన మున్సిపల్ సిబ్బంది

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

దుండిగల్, ఆగస్టు 28: 'పార్కు స్థలాలపై సంక్షేమ సంఘం కన్ను' శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో బుధవారం ప్రచురించిన కథనానికి దుండిగల్ మున్సిపల్ అధికారులు స్పందించారు. పార్కు స్థలంలో ఏర్పాటు చేసిన ప్రహరీని కూల్చివేశారు. దుండిగల్ మున్సిపాలిటీ, బౌరంపేట్ పరిధి, సింహపురికాలనీలో గతకొన్ని రోజులుగా కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పార్కు స్థలాల విక్రయాలపై ప్రచురించింది. సింహపురికాలనీ, ఏ - బ్లాక్‌లోని పార్కు స్థలంలోని కొంత భాగాన్ని సంక్షేమ సంఘం ప్రతినిధులు ఓ వ్యక్తికి 'గిఫ్ట్‌డీడ్' పేరిట విక్రయించడంతోపాటు డీ-బ్లాక్‌లోని మరో పార్కు స్థలాన్ని పక్కనే ఉన్న ప్లాట్ యజమానికి గుట్టుచప్పుడు కాకుండా కట్టబెట్టేందుకు గూడుపుఠాని జరుపుతున్న విషయాన్ని బట్టబయలు చేసింది. దీంతో స్పందించిన దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణరావు, టీపీవో సంజన సిబ్బందితో కలిసి పార్కు స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీని కూల్చివేశారు. అదే సమయంలో పార్కు స్థలాన్ని విక్రయించిన వారితోపాటు కొనుగోలుదారులపైనా క్రిమినల్ కేసులు నమోదు చేయించనున్నట్లు తెలిపారు.

నోటీసులు రావడంతో ఆందోళన చెందుతున్న నివాసితులు

సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఇండ్లకు నోటీసులు

అల్లాపూర్, ఆగస్టు 28: సున్నం చెరువు సమీపంలోని ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న ఇండ్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో నివాసితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేండ్లుగా ఇక్కడ నివసిస్తున్నామని, ఇప్పుడు అధికారులు నోటీసులు ఇచ్చి ఇండ్లు కూల్చేస్తామంటే తాము ఎక్కడికి పోవాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు పైసాపైసా కూడ బెట్టి ఇక్కడ స్థలాలు కొని రేకుల ఇండ్లు నిర్మించుకుని నివసిస్తున్నామన్నారు. ఈ విషయంలో ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో కలిపి మొత్తం సున్నంచెరువు 32 ఎకరాల్లో విస్తరించి ఉన్నది. కాగా, ప్రస్తుతం చెరువు 25 ఎకరాలు మాత్రమే ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. అయితే చెరువుల్లో వెలసిన నిర్మాణాలకు నోటీసులు ఇస్తున్న హైడ్రా, దర్జాగా కబ్జాలకు పాల్పడుతూ.. సమాన్యులను మోసం చేసి రూ.కోట్లు వెనకేసిన కబ్జారాయుళ్లపై చర్యలు తీసుకోరా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



GOVERNMENT OF TELANGANA
REVENUE DEPARTMENT
To the Tahsildar,
Kukatpally Mandal,
Medchal-Malkajgiri District.
Dated:29.08.2024
Sir,
NOTICE U/S-39 OF THE TELANGANA IRRIGATION ACT, 1357 FASLI
Sub:- Lands/Tanks- Medchal-Malkajgiri District- Malkajgiri Division - Kukatpally Mandal- Allapur Village -Illegal Constructions in FTL/Buffer Zone of Sunnam Cheruvu of Kukatpally- Notice issued- Reg.
Ref:- 1. W.P.No. 14728 of 2007 in the Hon'ble High Court of Telangana
2. The Additional Advocate General, High Court, Hyderabad, Lr. No. 766/2024, dated:02.08.2024.
3. Additional Collector (Local Bodies), Medchal-Malkajgiri District, Lr.No. LP/301/2024, Dt:19.08.2024.
Through the subject and references cited, the Additional Collector (Local Bodies), Medchal-Malkajgiri District has informed that the Advocate commission, as per the directions of Hon'ble High Court Dt:01.08.2024, W.P. No 14728 of 2007 has submitted report regarding the illegal encroachments/ constructions made in (25) acres full area in Hyderabad and Ranga Reddy District.
Further it is informed that the Addl. Advocate General requested to issue notices to all (963) encroachments pertaining to (34) lakes in Hyderabad and Ranga Reddy District immediately for demolition and produce the notices before the Addl. Advocate General so as to place them before the Hon'ble High Court.
During joint inspection of Sunnam Cheruvu situated at Allapur Village of Kukatpally Mandal and as per the boundaries fixed by the irrigation authority there exists full buildings and newly constructed buildings are effected in FTL/Buffer Zone of Sunnam Cheruvu of Allapur Village of Kukatpally Mandal and the details of encroachment are as follows.

Sl.No.	Name of the Lake/Name	Encroachment Extent (in Gts)	Encroachment area info in Sk.Mtrs/FTL/Buffer zone	Type of encroachment
1	Sunnam Cheruvu	5.00 (2 ga)	FTL/ Buffer zone	A.C.C

In view of the above circumstances, you are hereby directed to remove the above structures in the Sunnam Cheruvu situated at Allapur Village within (30) days from the date of receipt of this Notice or else necessary action will be initiated by the undersigned.

అధికారులు గోడకు అంటించిన నోటీసు

ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్వీ నేతలు

కడిగిన ముత్యంలా జైలు నుంచి బయటకు వచ్చిన ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోతి విజయ్‌కుమార్ ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ చేస్తున్న రాజకీయ కుట్రలకు భయపడేది లేదని తేల్చి చెప్పిన ధీరవతి కవిత అని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఆటలు తెలంగాణలో సాగబోవని, రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కవితను కలిసిన వారిలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత తదితరులు ఉన్నారు. *- కుత్బుల్లాపూర్, ఆగస్టు 28*

ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు దేశ సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసి విడుదల చేసిన సందర్భంగా ఓల్డ్‌బోయిన్‌పల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ విమానాశ్రయానికి వచ్చిన సందర్భంగా ఆమెకు స్వాగతం పలకడానికి కార్పొరేటర్ నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు బయలుదేరివెళ్లారు. కార్యక్రమంలో హరినాథ్, రాజుగౌడ్, పోచయ్య, ఐలేశ్, దేవేందర్, రాజు, బాలరాజు, లలిత, ఉమ, కొండమ్మ, పద్మ, సనిత, దేవి తదితరులు పాల్గొన్నారు. *- బాలానగర్, ఆగస్టు 28*

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, ఆగస్టు 28: ఉన్నత చదువుల కోసం దాతలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆకాంక్షించారు. పట్టుదలతో చదివి భవిష్యత్‌లో మరింత మందికి సాయం చేసే స్థాయికి ఎదగాలన్నారు. హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట్‌కు చెంది బత్తిని గాయత్రీ కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు రాగా కళాశాల ఫీజు నిమిత్తం కూకట్‌పల్లి కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో రూ.29వేల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో ఎమ్మెల్యే గాంధీ చేతులమీదుగా బుధవారం తన నివాసంలో అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థినికి చదువుకు సాయం చేసేందుకు సేవా సమితి ముందుకు రావడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో పలు కోర్సుల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు తన వంతు సాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. దాతలు అందిస్తున్న సాయంతో కష్టపడి చదువుకుని ఉత్తమ స్థాయికి ఎదిగి పేదలకు సాయం అందించే దశకు చేరుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌దాసు, గాంధీ, ఆనంద్, తిమ్మయ్య పాల్గొన్నారు.

- కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్‌లోని ఓంకారేశ్వర శివాలయం భక్త మార్కండేయ ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలతో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలకు నోటీసులు

మియాపూర్, ఆగస్టు 28: ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాల కూల్చివేతలలో హైడ్రా మెరుపు వేగంతో పని చేస్తున్న నేపథ్యంలో శేరిలింగంపల్లి మండలంలో అక్రమ నిర్మాణ దారుల్లో వణుకు మొదలైంది. ఈ నేపథ్యంలో ఏ క్షణంలో ఏ నిర్మాణాన్ని కూల్చేస్తారోనన్న ఆందోళనలు నెలకొన్న తరుణంలో.. ఐటీకి వేదికగా ఉన్న శేరిలింగంపల్లి మండలం దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలకు అధికారులు తాజాగా నోటీసులు జారీ చేశారు. కేవలం దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 200లకు పైగా అక్రమ నిర్మాణాలను గుర్తించి మండల రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణదారు పేరుతోనే ప్రత్యక్షంగా ఈ నోటీసులు ఇచ్చారు. నోటీసులు అందుకున్న వారిలో గుబులు మొదలైంది. అయితే దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధి వరకే కాకుండా మండలంలోని ఇతర చెరువులకు త్వరలోనే విస్తరించే అవకాశం ఉందనే సమాచారంతో నిర్మాణదారుల్లో ఆందోళన మొదలైంది. దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలకు జారీ అయిన నోటీసులలో సీఎం సోదరుడి నిర్మాణం సైతం ఉన్నట్లు సమాచారం.

అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్సీ కవితపై ఆధారాలు లేని ఆరోపణలని పేర్కొంటూ దేశ అత్యున్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసిందని, దీనిపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి కోరారు. ఈ మేరకు బుధవారం సహచర బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లతో కలిసి మహిళా కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. *- మియాపూర్, ఆగస్టు 28*

లార్వా దశలోనే దోమల నియంత్రణ

కూకట్‌పల్లి సర్కిల్ అస్‌బెస్టాస్ కాలనీలో ఏఎల్ఓ చర్యలను పరిశీలిస్తున్న డీసీ కృష్ణయ్య

పాపిరెడ్డి కాలనీలో బస్తీ దవాఖానను పరిశీలిస్తున్న డీసీ కృష్ణయ్య

డీసీ కృష్ణయ్య

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 28: లార్వా దశలోనే దోమలను నియంత్రించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్ కృష్ణయ్య అన్నారు. బుధవారం సర్కిల్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, అస్‌బెస్టాస్ కాలనీల్లో ఏఎల్‌వో ఆపరేషన్ చర్యలు బస్తీ దవాఖానను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీలు, బస్తీలలో దోమల సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాలనీల వారీగా ఏఎల్ఓ, ఫాగింగ్ చర్యలకు సంబంధించి షెడ్యూల్‌ను ప్రకటించడం జరిగిందని, ఆయా కాలనీల్లో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పూల కుండీలు, పనికి రాని వస్తువులలో నీరు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నియంత్రణలో భాగంగా చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగించడం, కుంటలలో ఆయిల్‌బాల్స్‌ను వేస్తున్నట్లు తెలిపారు. ఫాగింగ్ చర్యలు క్రమం తప్పకుండా చేస్తున్నామన్నారు. అలాగే బస్తీ దవాఖాన పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసర పరిశుభ్రత కోసం పారిశుధ్య కార్మికులు బాధ్యతగా పని చేయాలన్నారు.కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎం డీఈ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ వినయ్‌కాంత్‌రెడ్డి, ఎంటమాలజీ అసిస్టెంట్ నరేశ్ ఉన్నారు.

అందమైన చేతిరాతతో మెరుగైన ఫలితాలు

బాగా చదవడంతోపాటు అందమైన చేతిరాతను అలవర్చుకుంటే ఉత్తమ ఫలితాలు వస్తాయని ఉపాధ్యాయులు సూచించారు. జగద్గిరిగుట్ట శ్రీనివాసనగర్ మెరిట్ మోడల్ స్కూల్‌లో బుధవారం క్యాలిగ్రఫీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ల్యూసిడా హ్యాండ్‌రైటింగ్ కేంద్రం నిపుణుడు వంపు మల్లయ్య విద్యార్థులకు చేతిరాతలో పాటించాల్సిన పద్ధతులు తెలిపారు. ప్రిన్సిపాల్ జోతిర్మయి, నసీరుద్దీన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. *- జగద్గిరిగుట్ట, ఆగస్టు 28*

వైభవంగా విజయగణపతి ఆలయ వార్షికోత్సవం

హాజరైన ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

విజయ గణపతి ఆలయంలో పూజలో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 28 : కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లోని శ్రీవిజయ గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవం వైభవంగా సాగింది. బుధవారం గణపతి మండప దేవాతా పూజలు, హోమం, సుబ్రహ్మణ్య, అయ్యప్ప మూలమంత్ర హోమములు, నిత్యహోమములు, స్వామి వార్లకు పంచామృత, పంచగవ్య, పవిత్ర జలాలతో, అమృత ఫలాభిషేకం, పుష్పార్చన, గణపతి స్వామి వార్ల శాంతి కళ్యాణ వేడుకలు కమనీయంగా సాగాయి. సాయంత్రం స్వామివార్లకు రథోత్సవం, దిశా హోమములు, ఫలయాగము, హోమం పూజలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకుల్లో పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం మండప దేవాతా హోమములు మూలమంత్ర హోమములు, పూర్ణాహుతి, అవభృత స్నానము, వసంతోత్సవం, ధ్వజపట అవరోహణ, పవళింపు సేవా పూజలు ఉంటాయని తెలిపారు. ఈ వేడుకల్లో కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, ఆగస్టు 28: ఆర్థిక ఇబ్బందులతో కుటుంబంలో నెలకొన్న కలహాలతో జీవితంపై విరక్తి చెంది మనస్తాపానికి గురైన మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దూలపల్లిలోని మహాలక్ష్మి ఎంక్లేవ్‌లో రాకేశ్ తన భార్య లావణ్య(30), నాలుగేండ్ల పాపతో కలిసి నివాసం ఉంటున్నారు. నరేశ్ గత కొంతకాలంగా ఎలాంటి పని చేయకుండా తాగుడుకు బానిసయ్యాడు. దీంతో ఆర్థికంగా ఇంట్లో నిత్యం భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్న క్రమంలో జీవితంపై విరక్తి చెందిన లావణ్య మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయం

మేడ్చల్ రూరల్, ఆగస్టు 28: పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయమని మేడ్చల్ మాజీ ఎంపీపీ రజితా రాజమల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒసాట్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో సుమారు రూ.1 కోటి నిధులతో నిర్మించే ఐదు అదనపు గదుల నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని కోరా రు. అనంతరం ట్రస్ట్ ప్రతినిధి నర్సింగ్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించి, చిన్నారులను బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలనేదే తమ సంస్థ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాజమల్లారెడ్డి, గీతా భాగ్య రెడ్డి, సంజీవరావు, గ్రామ ప్రత్యేక అధికారి వినూత్న, ఒసాట్ సంస్థ ప్రతినిధులు సత్య ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భాగ్యరెడ్డి, అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డబిల్‌పూర్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

క్రీడలతో యువతలో పోటీతత్వం పెరుగుతుంది

బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్

విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్

దుండిగల్, ఆగస్టు 28: క్రీడా పోటీల నిర్వహణతో యువతలో పోటీతత్వం పెరుగుతుందని బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్ అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి, బాలానగర్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన వాలీబాల్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. బాలానగర్ జోనల్ లెవల్ టోర్నమెంట్ పేరిట నిర్వహించిన ఈ పోటీల్లో బాలానగర్ జోన్‌లోని 8 పీఎస్ పరిధిలోని మొత్తం 40 జట్లు పాల్గొనగా.. బాచుపల్లి జట్టు విజేతగా నిలువగా, అల్లాపూర్ జట్టు రెండో స్థానం, అల్లాపూర్ పీఎస్ పరిధిలోని వివేకానంద్ జట్టు మూడో స్థానంలో నిలిచాయి. ముగింపు వేడుకలకు డీసీపీ సురేశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు ప్రోత్సాహక బహుమతులతోపాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, దుండిగల్ సీఐ జే.ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయండి

పైప్‌లైన్ దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్

మియాపూర్, ఆగస్టు 28: ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో భూగర్భ డ్రైనేజీ పనుల పరంగా దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్ ప్రాంతాన్ని కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైప్‌లైన్ పనులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులను పూర్తి చేయాలని, తాగునీటి పరంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ, రహదారి విస్తరణ పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జలమండలి మేనేజర్ ప్రశాంతి, ఏఈ శ్రావణి, మహదేవ్, విజయ్, పార్టీ నేతలు పాల్గొన్నారు. ఎల్లమ్మబండ జయనగర్ కాలనీ రహదారిని మట్టితో చదును చేస్తున్న పనులను కార్పొరేటర్ వెంకటేశ్ పరిశీలించారు.

- హైదర్‌నగర్ డివిజన్ జైభారత్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 28 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు(కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 17, వంకాయ 28, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 57, కాకరకాయ 26, బీరకాయ 28, క్యాబేజి 15, ఫ్రెంచ్ బీన్స్ 57, క్యారెట్ 50, కాలీఫ్లవర్ 18, దొండ 21, చిక్కుడు 45, గోరు చిక్కుడు 28, బీట్‌రూట్ 25, క్యాప్సికం 45, ఆలుగడ్డ 38, కీరా 28, దోసకాయ 13, సొరకాయ 11, పొట్లకాయ 13, కందగడ్డ 50, ఉల్లి పొరక 35, ఉల్లిగడ్డ 52, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1)8 నుంచి 10, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 75, గుమ్మడికాయ 19, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 6 నుంచి 8, పచ్చి బఠాని 85, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండు మిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 360, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

అంబీర్ చెరువు అలుగు తీసేందుకు యత్నం

అడ్డుకున్న మత్స్యకార సంఘం ప్రతినిధులు

అంబీర్ చెరువు అలుగు వద్ద మత్స్యకార సంఘం డైరెక్టర్ లక్ష్మణ్, ఇతర ప్రతినిధులు

మియాపూర్, ఆగస్టు 28 : శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ డివిజన్ అంబీర్ చెరువు అలుగు నుంచి కిందికి నీటిని విడుదల చేసే విషయమై బుధవారం అధికారులు మత్స్యకారుల సంఘానికి మధ్య వైరుధ్యం ఏర్పడింది. ప్రగతినగర్‌లో ఇండ్లలోకి నీరు వస్తుండటంతో పాటు నాలాలు, మ్యాన్‌హోళ్లు నిండుతుండటం, మాన్‌సూన్ నేపథ్యంలో చెరువులో నీటి నిల్వను మూడు ఫీట్లకు తగ్గించేందుకు అలుగు ద్వారా నీటిని కిందికి విడుదల చేసేందుకు అధికారులు యంత్రాల సాయంతో చర్యలకు సిద్ధం అయ్యారు. దీంతో రూ.50లక్షల విలువైన చేప పిల్లలను చెరువులో వేసినందున నీటి విడుదలతో తమ ఉపాధికి భంగం కలుగుతుందని మత్స్యకార సహకార సంఘం ప్రతినిధులు నీటి విడుదలను అడ్డుకున్నారు. ఎటువంటి లిఖిత పూర్వక ఆదేశాలు లేకుండా అనధికారికంగా అలుగు ద్వారా నీటిని విడుదల చేసేందుకు అధికారులు సిద్ధం అయ్యారని, దీని వల్ల చేప పిల్లలు బయటికి పోయి నష్టపోవడమే కాకుండా.. కింది వైపు భూగర్భ జలాలు తగ్గుతాయని మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ నీరుడు లక్ష్మణ్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. అనధికారిక నీటి విడుదలపై మత్స్యకార సంఘం ప్రతినిధులు కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఇరిగేషన్ సిబ్బంది ఇచ్చిన లిఖిత పూర్వక ఆదేశాలు చూపాలని కోరగా.. లేనట్లుగా సమాధానం ఇచ్చారు. దీంతో చేసేది లేక అలుగు తొలగించే పనులు నిలిపి వెనుదిరిగారు. ఈ ఘటనలపై ఇరిగేషన్ ఏఈ విశ్వంను 'నమస్తే తెలంగాణ ప్రతినిధి' వివరణ కోరగా.. మాన్‌సూన్ సమయంలో చెరువులో 3 ఫీట్లకు నీటిని తగ్గించాలన్న ఆదేశాలున్నాయని, తమ ఈ ప్రయత్నాన్ని మత్స్యకారుల సంఘం ప్రతినిధులు రెండుస